సాక్షి సూర్యాపేట

మంగళవారం : 14 : మే : 2024


సూర్యాపేటలోని రిసెప్షన్ సెంటర్‌కు ఈవీఎంలను తీసుకొస్తున్న సిబ్బంది


మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకున్న ఆనందంలో యువతులు


ఆత్మకూర్(ఎస్) ప్రభుత్వ పాఠశాలలో ఓటు వేసేందుకు బారులుదీరిన మహిళా ఓటర్లు

న్యూస్‌రీల్

సజావుగా ఓటింగ్ ప్రక్రియ

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటరావు

సూర్యాపేట, భానుపురి : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.వెంకటరావు అన్నారు. సోమవారం సూర్యాపేటలోని కృష్ణానగర్ పోలింగ్ కేంద్రంలో కలెక్టర్ వెంకటరావు, అదనపు కలెక్టర్ సీహెచ్.ప్రియాంక, రామన్ కాన్సెప్ట్ హైస్కూల్‌లో అదనపు కలెక్టర్ బీఎస్.లత, తాళ్లగడ్డలోని 50వ పోలింగ్ బూత్‌లో జిల్లా ఎస్పీ రాహుల్‌హెగ్డే, ట్రైనీ ఐపీఎస్ అధికారి రాజేష్‌మీనాలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పలు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి పోలింగ్ సరళిని పరిశీలించి మాట్లాడారు. జిల్లాలోని నల్లగొండ, భువనగిరి లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో 10,00, 012 లక్షల మంది ఓటర్లు ఉండగా 7,46,163 మంది తమ ఓటుహక్కు వినియోగించుకోగా మొత్తంగా 74.61 శాతం పోలింగ్ నమోదైందని తెలిపారు. ఈవీఎంలను పోలీస్ బందోబస్తు నడుమ నల్లగొండ, భువనగిరిలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలకు తరలించి భద్రపర్చనున్నట్టు పేర్కొన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ కంట్రోల్ రూమ్‌ను జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డేతో కలిసి పోలింగ్ సరళిని పరిశీలించారు. అంతకుముందు సాధారణ పరిశీలకుడు మనోజ్ కుమార్ మణిక్యరావు సూర్యవంశీ, అదనపు కలెక్టర్ సీహెచ్.ప్రియాంకతో కలిసి పోలింగ్ సరళిని వెబ్ కాస్టింగ్ కంట్రోల్ రూమ్ ద్వారా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ అప్పారావు, డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, డీపీఓ సురేష్‌కుమార్, సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవ్, తహసీల్దార్ శ్యామ్ సుందర్‌రెడ్డి, కలెక్టరేట్ ఏఓ సుదర్శన్‌రెడ్డి, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు శ్రీనివాసరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్‌కు పటిష్ట భద్రత కల్పించాం

- ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట: జిల్లాలో లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని, పటిష్టమైన పోలీసు భద్రత కల్పించామని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు. పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం సోమవారం రాత్రి సూర్యాపేటలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పోలింగ్ ప్రక్రియ ముగిసిందన్నారు. ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన నాటి నుంచి జిల్లా యంత్రాంగం, పోలీసు, ఇతర అన్ని శాఖల అధికారులమంతా సమన్వయంతో పని చేశామన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ విజయవంతం కావడానికి సహకరించిన సిబ్బంది, ఓటర్లకు ధన్యవాదాలు తెలుపుతున్నామని ఎస్పీ పేర్కొన్నారు. బందోబస్తు నిర్వహించిన పోలీసు సిబ్బందికి, పోలింగ్ విధులు నిర్వర్తించిన ప్రత్యేక, ఇతర అధికారులకు అభినందనలు తెలిపారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో సోమవారం శ్రీరాజ్యలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహ స్వామి నిత్య, శాశ్వత కల్యాణాన్ని అర్చకులు వేద మంత్రాల నడుమ వైభవంగా నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులకు గరుడవాహన సేవ నిర్వహించారు. చివరగా మహానివేదనతో భక్తులను తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనర్సింహమూర్తి, ఆంజనేయచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

పోలింగ్ ప్రశాంతం

నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో 73.98 శాతం నమోదు

- అక్కడక్కడా మొరాయించిన ఈవీఎంలు, వీవీప్యాట్లు
- వాటిని మార్చి పోలింగ్ కొనసాగించిన అధికారులు
- పోలింగ్ సరళిని పరిశీలించిన రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ హరిచందన
- స్ట్రాంగ్ రూమ్‌కు చేరిన ఈవీఎంలు
- జూన్ 4వ తేదీన నల్లగొండలో కౌంటింగ్


చివ్వెంల మండలం కుడకుడలో ఓటేసేందుకు వస్తున్న వృద్ధుడు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: నల్లగొండ లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. డిండి మండలం దేవత్‌పల్లితండా మినహా ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు. అక్కడక్కడా ఈవీఎంలు మొరాయించడంతో కొద్దిసేపు పోలింగ్ నిలిచిపోయినా, ఆ తరువాత వాటిని సరిచేయడం, కొత్తవి ఏర్పాటు చేయడంతో పోలింగ్ యథావిధిగా కొనసాగింది. ఉదయం 7 గంటలకు మొదలైన పోలింగ్ రాత్రి వరకు కొనసాగింది. రాత్రి పది గంటల వరకు అందిన సమాచారం మేరకు మొత్తం 73.98 శాతం పోలింగ్ నమోదైంది. గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్లు ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొనగా, పట్టణ ప్రాంతాల్లో మాత్రం ఆ ఉత్సాహం కనిపించలేదు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం ద్వారా ఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన పోలింగ్ సరళిని పరిశీలించారు. పోలింగ్ ముగిసిన తరువాత ఈవీఎంలు అన్నింటిని నల్లగొండ పట్టణ సమీపంలోని దుప్పలపల్లి వద్ద ఉన్న వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోదాముల్లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించేందుకు చర్యలు చేపట్టారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేస్తున్నారు. జూన్ 4వ తేదీన కౌంటింగ్ జరగనుంది.


ఆత్మకూర్(ఎస్) మండలం కోటినాయక్‌తండాలో ఓటేసేందుకు బారులుదీరిన ఓటర్లు

పోలింగ్ సరళి ఇలా..

నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. మొదటి రెండు గంటల వరకు అంటే ఉదయం 9 గంటల వరకు 12.80 శాతం, 9 గంటల నుంచి 11 గంటల వరకు 31.21 శాతం, 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 48.48 శాతం, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3 గంటల వరకు 51.91 శాతం, సాయంత్రం 5 గంటల వరకు 70.36 శాతం పోలింగ్ నమోదైంది. సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ బూత్‌లో లైన్‌లో ఉన్న వారికి ఓటు వేసే అవకాశం ఇవ్వడంతో కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు బారులుదీరారు. రాత్రి 10 గంటల వరకు అందిన తుది సమాచారం మేరకు 73.98 శాతం పోలింగ్ నమోదైంది. అయితే వీటికి పోస్టల్ బ్యాలెట్, ఎన్‌ఆర్‌ఐ ఓట్లు కలిపితే మొత్తంగా ఎంత శాతం ఓట్లు పోలయ్యాయన్న లెక్క తేలనుంది.



2019లో 74.13 శాతం

2019 లోక్‌సభ ఎన్నికల్లో, పోస్టల్, ఎన్‌ఆర్‌ఐ ఓట్లు కలుపుకొని మొత్తంగా 74.13 శాతం పోలింగ్ నమోదు కాగా, ఈసారి రాత్రి 10 గంటల వరకు అందిన సమాచారం మేరకు 73.98 శాతం పోలింగ్ నమోదైంది. వీటికి పోస్టల్, ఎన్‌ఆర్‌ఐ ఓట్లు కలపాల్సి ఉంది. ఇక 2014 ఎన్నికల్లో 79.75 శాతం పోలింగ్ నమోదైంది. 2014తో పోల్చితే మాత్రం ఈసారి తక్కువే పోలింగ్ నమోదైనట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

ఈవీఎంలు మొరాయించిన ప్రాంతాలు ఇవే..

- కోదాడ నియోజకవర్గంలోని మునగాల మండలం 74వ పోలింగ్ కేంద్రంలో మాక్ పోలింగ్ పూర్తయ్యాక ఈవీఎం మొరాయించింది. దీంతో అరగంటపాటు పోలింగ్ ఆగిపోయింది. తరువాత సరిచేయడంతో పోలింగ్ కొనసాగింది. మునగాల మండలంలోని 81వ బూత్‌లో కూడా ఈవీఎం మొరాయించడంతో కాసేపు పోలింగ్ ఆగిపోయింది.
- సాగర్ నియోజకవర్గంలోని హాలియాలోని 162వ పోలింగ్ స్టేషన్‌లో ఉదయం 7.30 గంటలకు ఈవీఎం కొద్దిసేపు మొరాయించింది. దీంతో ఈవీఎంను మార్చేసి పోలింగ్‌ను కొనసాగించారు. పెద్దవూరలోని 81వ పోలింగ్ స్టేషన్‌లో ఈవీఎం మొరాయించడంతో 20 నిమిషాల పాటు పోలింగ్ నిలిచిపోయింది. నిడమనూరు మండలం బంకాపురంలో ఈవీఎం మొరాయించడంతో పోలింగ్ అరగంట పాటు ఆలస్యమైంది.
- దేవరకొండ నియోజకవర్గంలోని చింతపల్లి మండలం కుర్మేడులోని 11వ బూత్‌లో వీవీ ప్యాట్ పనిచేయకపోవడంతో దానిని మార్చారు.
- హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని చింతలపాలెం మండలం వజినేపల్లిలో ఈవీఎం మొరాయించడంతో కొద్దిసేపు పోలింగ్ ఆగిపోయింది. చింతలపాలెం, నక్కగూడెం గ్రామాల్లో వీవీ ప్యాట్స్ పనిచేయకపోవడంతో వాటిస్థానంలో కొత్తవి అమర్చారు.
- మిర్యాలగూడ మండలం జైత్యతండాలో ఈవీఎం నిర్వహణపై అవగాహన లేకపోవడంతో పోలింగ్ అరగంట పాటు నిలిచిపోయింది. ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో సెక్టోరియల్ అధికారి వచ్చి దాన్ని ప్రారంభించడంతో పోలింగ్ కొనసాగింది.
- సూర్యాపేట మండలం పిల్లలమర్రిలోని 21వ పోలింగ్ కేంద్రంలో ఈవీఎం కాసేపు మొరాయించింది. దీనిపై ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో టెక్నికల్ సిబ్బంది వచ్చి సరిచేశారు.
- పెన్‌పహాడ్ మండలం జలమాలకుంటతండా పోలింగ్ స్టేషన్‌లో వీవీ ప్యాట్ పనిచేయలేదు. దీంతో పోలింగ్ కొద్దిసేపు ఆగింది. అధికారులకు సమాచారం ఇవ్వడంతో దాని మరొకటి ఏర్పాటు చేశారు.

నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా పోలింగ్ శాతం..

దేవరకొండ	నాగార్జునసాగర్	మిర్యాలగూడ	హుజూర్‌నగర్	కోదాడ	సూర్యాపేట	నల్లగొండ
70.18	74.45	73.34	76.30	75.15	73.02	75.40

భువనగిరి పరిధిలో..

భువనగిరి	మునుగోడు	జనగామ	నకిరేకల్	తుంగతుర్తి	ఆలేరు	ఇబ్రహీంపట్నం
80.24	83.70	70.25	72.34	71.03	79.12	63.13


సూర్యాపేటలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ గోదాములోకి ఈవీఎంలను చేరుస్తున్న సిబ్బంది

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి నల్లగొండ పబ్లిక్ స్కూల్‌లోని పోలింగ్ స్టేషన్‌లో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కోదాడలోని నయానగర్ పోలింగ్ కేంద్రంలో రాష్ట్ర పౌర సరఫరాలు, భారీ నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఆయన సతీమణి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి ఓటు హక్కు వినియోగించుకున్నారు. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి నల్లగొండలోని ఎన్జీ కాలనీ పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి నాగార్జునసాగర్ తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి శానంపుడి సైదిరెడ్డి తన తల్లితో కలిసి హుజూర్‌నగర్‌లో ఓటు వేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి చిట్యాల మండలం ఉరుమడ్లలో ఓటు హక్కు వేశారు. కలెక్టర్ వెంకటరావు సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కృష్ణానగర్‌లో గల 66వ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు.


సూర్యాపేటలో ఓటేసిన అనంతరం సిరా గుర్తు చూపుతున్న కలెక్టర్ వెంకటరావు

హైవేలపై వాహనాల బారులు

- పంతంగి, కొర్లపహాడ్, గూడూరు టోల్‌ప్లాజాల వద్ద రద్దీ
- ఓటేసి హైదరాబాద్ వైపు పయనమవుతున్న ప్రజానీకం

చౌటుప్పల్, కేతేపల్లి, బీబీనగర్ : హైదరాబాద్–విజయవాడ, హైదరాబాద్– వరంగల్ జాతీయ రహదారులపై సోమవారం వానహనాలు బారులుదీరాయి. తెలంగాణలో పార్లమెంట్, ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభతోపాటు అసెంబ్లీ ఎన్నికలకు హైదరాబాద్‌తోపాటు పరిసర ప్రాంతాల్లో నివాసం ఉన్నవారు ఓటు వేసేందుకు సొంతూర్లకు వెళ్లి సోమవారం తిరుగుప్రయాణమయ్యారు. దీంతో చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా, కేతేపల్లి మండలం కొర్లపహాడ్ శివారులోని టోల్‌ప్లాజా, బీబీనగర్ మండలంలోని గూడూరు టోల్‌ప్లాజాల వద్ద సాయంత్రం నుంచి వాహనాలు క్యూ కడుతున్నాయి. పంతంగిటోల్‌ప్లాజా వద్ద మొత్తం 16టోల్ బూత్‌లు ఉండగా హైదరాబాద్ మార్గంలో తొమ్మిది బూత్‌లను కేటాయించి వాహనాలు వదులుతున్నారు. అదనంగా సిబ్బందిని నియమించారు. హ్యాండ్ స్కానర్‌లను అందుబాటులో ఉంచారు. సాధారణ రోజుల్లో టోల్‌ప్లాజా మీదుగా 30 నుంచి 35 వేల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే మంగళవారం ఉదయం వరకు అదనంగా మరో 20వేల వాహనాలు ప్రయాణించే అవకాశాలు ఉన్నాయి.

అదనపు కౌంటర్లు కేటాయించి..

వాహనాల రద్దీకి అనుగుణంగా కొర్లపహాడ్‌లోని టోల్‌ప్లాజా నిర్వాహకులు హైదరాబాద్ వైపు వెళ్లే వాహనదారులు టోల్ చెల్లించేందుకు అదనపు కౌంటర్లు కేటాయించారు. టోల్‌ప్లాజాలోని 12 కౌంటర్లలో ఏడింటిని హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలకు కేటాయించారు. దీంతో రహదారిపై భారీ సంఖ్యలో వాహనాలు వస్తున్నా టోల్‌ప్లాజా వద్ద ఎలాంటి ఇబ్బందులు ఏర్పడలేదు. గూడూరు టోల్‌ప్లాజా వద్ద వాహనాలు భారీగా తరలి రావడంతో ఫాస్టాగ్ స్కానింగ్ ఆలస్యం అవుతోంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

సరిపడా బస్సులు లేక

ఓటు వేసిన తర్వాత గ్రామాల నుంచి వివిధ ప్రాంతాలకు తిరుగు ప్రయాణం అయ్యేందుకు ప్రజలు నానా అవస్థలు పడ్డారు. ఆర్టీసీ బస్సులు సరిపడా అందుబాటులో లేకతిప్పలు తప్పలేదు. చౌటుప్పల్ ఆర్టీసీ బస్‌స్టేషన్‌తోపాటు ప్రధాన రహదారులపై ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాల కోసం గంటలపాటు నిరీక్షించారు. అదే విధంగా హోటళ్లు, రెస్టారెంట్లు సైతం జనంతో కిటకిటలాడాయి. మహిళలు, వృద్ధులు, చిన్నారులు చాలా అవస్థలకు గురయ్యారు.


బీబీనగర్ : గూడూరు టోల్‌ప్లాజా వద్ద వాహనాలు


చౌటుప్పల్‌లో జాతీయ రహదారిపై రాత్రి సమయంలోని రద్దీ


చౌటుప్పల్ : పంతంగి టోల్‌ప్లాజా వద్ద బారులుదీరిన వాహనాలు


కేతేపల్లి : కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద..

భువనగిరిలో 80 శాతం పోలింగ్

సాక్షి, యాదాద్రి : భువనగిరి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ఓటర్లలో చైతన్యం వెల్లివిరిసింది. సోమవారం జరిగిన ఎన్నికల్లో రికార్డ్ స్థాయిలో 80 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం 7గంటల నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులుదీరారు. పోలింగ్ సమయం అదనంగా గంట పెంచడం, ఓటింగ్ శాతం పెంచేందుకు ఎన్నికల కమిషన్ చేపట్టిన కార్యక్రమాలు ఫలించాయి. ఎండ తీవ్రత తగ్గడం కూడా పోలింగ్ శాతం పెరగడానికి దోహదపడింది. పట్టణాలు, గ్రామాల్లో ఓటర్లు పెద్ద సంఖ్యలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. పలు చోట్ల ఈవీఎంలు మొరాయించడంతో అధికారులు వాటిని సరి చేసి పోలింగ్ కొనసాగించారు.


చౌటుప్పల్‌లో ఓటు వేసేందుకు క్యూకట్టిన జనం

ఓటింగ్ సరళిని పరిశీలించిన అభ్యర్థులు

బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్, కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటింగ్ సరళిని పరి శీలించారు. తమ పార్టీ నాయకుల ద్వారా ఓటింగ్ జరుగుతున్న తీరును తెలుసుకున్నారు.

ఓటు ఉన్నా.. వేసే అవకాశం లేకపాయే..

ఆత్మకూరు(ఎం) : హోం ఓటింగ్‌కు దరఖాస్తున్న చేసుకున్న వ్యక్తి ఓటు వేయలేదు. అయితే ఆ వ్యక్తి సోమవారం జరిగిన ఎన్నికల పోలింగ్‌కు వచ్చినప్పటికీ ఓటు వేసే అవకాశం లేకుండా పోయింది. ఈ సంఘటన ఆత్మకూరు(ఎం) మండలం పారుపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన తవిటి సోమిరెడ్డి వయస్సు 86 సంవత్సరాలు. అధికారులు అతడికి హోం బ్యాలెట్ ఓటు వేయడానికి అవకాశం కల్పించారు. ఆ గ్రామంలో మొత్తం తొమ్మిది మంది వయో వృద్ధులకు హోం బ్యాలెట్ ఓటింగ్‌కు అవకాశం కల్పించారు. అయితే అందులో ఆరుగురు మాత్రమే హోం బ్యాలెట్ ఓటు వేశారు. సోమిరెడ్డి, మరో ఇద్దరు హోం బ్యాలెట్ ఓటు వేయలేదు. దీంతో సోమిరెడ్డి సోమవారం ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రానికి వెళ్లాడు. అక్కడ ఓటరు జాబితాలో తవిటి సోమిరెడ్డి (పీబీ) పోస్టల్ బ్యాలెట్ సీల్ వేసి ఉండడంతో ఎన్నికల సిబ్బంది ఓటు వేయడానికి అవకాశం ఇవ్వలేదు. సమస్యను ఎన్నికల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకపోయినప్పటికీ ఫలితం లేకపోవడంతో చివరకు సోమిరెడ్డి ఓటు వేయకుండానే వెళ్లిపోయాడు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

మాక్ పోలింగ్‌లో అన్ని ఓట్లూ నోటాకే..!

పాలకవీడు : మండలవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. అయితే శూన్యపహాడ్‌లోని 53వ పోలింగ్ బూత్‌లో ఉదయం 6 గంటలకు నిర్వహించిన మాక్ పోలింగ్‌లో కొంత గందరగోళం నెలకొంది. మాక్ పోలింగ్‌లో పాల్గొన్న ఏజెంట్లు తమతమ పార్టీల గుర్తులపై ఓటు వేయగా ప్రతీది నోటాకు పోలైంది. దీంతో ఏజెంట్లు అధికారులను ప్రశ్నించారు. అప్రమత్తమైన అధికారులు ఈవీఎం, వీవీప్యాట్ యంత్రాలను సరిచేశారు. అనంతరం ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగింది.

ఎన్నికల నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసు నమోదు

మునగాల : ఎన్నికల నిబంధనలు అతిక్రమించినందుకు మునగాల మండలంలోని నేలమర్రి గ్రామంలో ఓ వ్యక్తిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్ఐ బైరెడ్డి అంజిరెడ్డి తెలిపారు. వివరాలు.. నేలమర్రి గ్రామానికి చెందిన పల్లేటి గోపి గ్రామంలోని 51వ పోలింగ్ బూత్‌లోకి ఓటు వేసేటప్పుడు మొబైల్ వెంట తీసుకుని వెళ్లి వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశాడు. దీంతో సంబంధిత పోలింగ్ కేంద్రం పీఓ కొత్తపల్లి బెంజిమన్ ఫిర్యాదు మేరకు గోపిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మిర్యాలగూడలో..

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామానికి చెందిన వస్కూల మధు సోమవారం 164వ పోలింగ్ కేంద్రంలో ఓటు వేసిన తరువాత వీవీ ప్యాట్‌లో కనిపించే స్లిప్‌ను ఫొటో తీసి తన వాట్సాప్ స్టేటస్‌లో పెట్టుకున్నాడు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మిర్యాలగూడ రూరల్ పోలీసులు విచారణ చేపట్టారు. యాద్గార్‌పల్లి పోలింగ్ ఆఫీసర్ నారయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎన్నికల నియమావళి, నిబంధనల చట్టం కింద మధుపై కేసు నమోదు చేసినట్లు మిర్యాలగూడ రూరల్ సీఐ వీరబాబు తెలిపారు.

ప్రజల ఆలోచనల్లో మార్పు వచ్చింది

- సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి



సూర్యాపేట : అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు ఇచ్చిన తీర్పు ఇప్పుడు మారనుందని, ఐదు నెలల్లో ప్రజల ఆలోచనల్లో పెను మార్పులు వచ్చాయని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. సోమవారం లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సందర్భంగా సూర్యాపేటలోని శ్రీ చైతన్య స్కూల్ పోలింగ్ బూత్‌లో జగదీష్‌రెడ్డి తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ కేసీఆర్ సీఎంగా లేనిలోటు స్పష్టంగా కనపడుతోందని ప్రజలే చెబుతున్నారని అన్నారు. ప్రజా స్పందన చూస్తుంటే మెజార్టీ సీట్లు బీఆర్‌ఎస్‌కు వస్తాయనే నమ్మకం కలుగుతోందన్నారు.

ఓటు వేసిన అధికారులు



నల్లగొండలో ఓటు వేసి సిరా గుర్తు చూపుతున్న కలెక్టర్ హరిచందన, ఎస్పీ చందనా దీప్తి



సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్న కలెక్టర్ ఎస్. వెంకటరావు, ఎస్పీ రాహుల్ హెగ్డే, అదనపు కలెక్టర్లు ప్రియాంక, బీఎస్ లత



రాయగిరిలో సిరా గుర్తు చూపుతున్న యాదగిరిగుట్ట ఈఓ భాస్కర్ రావు



రామన్నపేట : భోగారంలో ఓటు వేసిన హైకోర్టు జడ్జి జస్టిస్ లక్ష్మణ్‌గౌడ్-మంజుల



యాదగిరిగుట్ట పట్టణంలోని 145వ పోలింగ్ బూత్‌లో ఓటేసేందుకు నిల్చున్న ఓటర్లు



నల్లగొండ: బోయవాడ పోలింగ్ కేంద్రంలో ఓటేసిన ట్రాన్స్‌జెండర్లు



డిండి మండలం సింగరాజుపల్లిలో ఓటేసేందుకు బారులుదీరిన మహిళలు



సూర్యాపేటలోని బేబీమూన్ స్కూల్‌లో పోలింగ్ అనంతరం ఈవీఎంలను సీల్ చేస్తున్న సిబ్బంది



మర్రిగూడ: ఆదర్శ పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అడిషనల్ ఎస్పీ రాములునాయక్



సూర్యాపేట: కుడకుడ జెడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటుచేసిన మహిళా పోలింగ్ కేంద్రం



నల్లగొండ మండలం కొత్తపల్లిలో ఓటు వేసేందుకు బారులుదీరిన ఓటర్లు



నడిగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో బారులుదీరిన ఓటర్లు



నల్లగొండ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆదర్శ పోలింగ్ కేంద్రం



సంస్థాన్ నారాయణపురం: జనగాం గ్రామంలోని పోలింగ్ కేంద్రం ముందు నిలిచిన వర్షపు నీరు



నల్లగొండలోని ఓ పోలింగ్ కేంద్రంలో క్యూలో నిల్చున్న ముస్లిం మహిళలు



నార్కట్‌పల్లి: అమ్మనబోలులో ఓటు వేసేందుకు కూర్చున్న మహిళలు



నల్లగొండ పట్టణంలోని మోడల్ పోలింగ్ కేంద్రంలో బారులుదీరిన ఓటర్లు



నల్లగొండ : ఓటు వేసి సిరా గుర్తు చూపుతున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల



హాలియా : ఇబ్రహీంపేటలో ఓటు వేస్తున్న మాజీ ఎమ్మెల్యే భగత్



రాజాపేట : పారుపల్లిలో ఓటు వేసిన మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు



సంస్థాన్ నారాయణపురం : లింగవారిగూడెంలో ఓటు వేసిన మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి



మోటకొండూరు : కదిరేనిగూడెంలో ఓటుహక్కు వినియోగించుకున్న మాజీ ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి దంపతులు



మిర్యాలగూడ : ఓటువేసి సిరా గుర్తు చూపుతున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు



యాదగిరి గుట్ట : వంగపల్లిలో ఓటు హక్కు వినియోగించుకున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత



దేవరకొండ : రత్యతండాలో ఓటువేసిన మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్



మిర్యాలగూడ : ఓటు హక్కు వినియోగించుకున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి



సూర్యాపేట : మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డికి సిరా పెడుతున్న సిబ్బంది



తిరుమలగిరి: ఓటు వేసి సిరాగుర్తు చూపుతున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్



నార్కట్‌పల్లి : కొత్తగూడెంలో సిరా గుర్తు చూపుతున్న నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి



తుర్కపల్లి : ఓటు వేసిన సీఎం సీపీఆర్ఓ బోరెడ్డి అయోధ్యరెడ్డి కుటుంబ సభ్యులు

విదేశాల నుంచి వచ్చి ఓటు వేసి..



ఓటేసిన రామకృష్ణ

నకిరేకల్ : మున్సిపాలిటీ కేంద్రంలోని చీమలగడ్డకు చెందిన అనంత రామకృష్ణ యూఎస్ఏలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం జరిగిన లోక్‌సభ ఎన్నికల పోలింగ్ కోసం రామకృష్ణ స్వగ్రామానికి వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నాడు. గత నవంబర్‌లో జరిగిన శాసన సభ ఎన్నికల్లో కూడా యూఎస్ఏ నుంచి వచ్చి ఓటు హక్కు వినియోగించుకుని వెళ్లాడు.

యూఏఈ నుంచి ..



ఓటేసిన భాస్కర్ గౌడ్-సరిత దంపతులు

బొమ్మలరామారం: ఓటు ఎంతో విలువైంది. దానిని వినియోగించుకోవడానికి ఎక్కడెక్కడి నుంచో ఓటర్లు సొంతూళ్లకు వెళ్తుంటారు. ఓటు వేయడానికి ఇద్దరు దంపతులు ఏకంగా యూఏఈ నుంచి స్వగ్రామానికి వచ్చారు. యాదగిరిగుట్ట మండలం బాహుపేటకు చెందిన బొల్లేపల్లి భాస్కర్ గౌడ్-సరిత దంపతులు యూఏఈలోని సెంట్రల్ బీచ్ ఏరియాలో స్థిరపడ్డారు. భాస్కర్‌గౌడ్ అబుదాబిలోని ప్రముఖ ఆయిల్ కంపెనీలో ఉన్నతస్థాయి ఉద్యోగం చేస్తున్నారు. ఓటు వేయడానికి రెండు రోజుల సెలవుపై తన సతీమణితో కలిసి ఆదివారం సొంతూరుకు వచ్చాడు. ఇద్దరికి కలిపి రానుపోను ఫ్లైట్ ఖర్చులకు రూ.1.20 లక్షలు వెచ్చించారు. బాహుపేటలో సోమవారం ఓటు హక్కు వినియోగించుకున్నారు.

న్యూజిలాండ్ నుంచి..



పెద్దవూర: ఉట్లపల్లిలో ఓటువేసి సిరాగుర్తు చూపుతున్న భవ్యశ్రీ

పెద్దవూర : మండలంలోని ఉట్లపల్లి గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ భీరెడ్డి భవ్యశ్రీ న్యూజిలాండ్ దేశం నుంచి వచ్చి మొదటిసారిగా తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. గత శాసనసభ ఎన్నికల సమయంలోనే ఓటు హక్కును వినియోగించుకోవాలని అనుకున్నా అనివార్య కారణాల వల్ల రాలేకపోయినట్లు ఆమె తెలిపారు. తన జీవితంలో మొదటిసారిగా ఓటు హక్కును వినియోగించుకోవడం చాలా ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

అమెరికా టు మిర్యాలగూడ



మిర్యాలగూడ టౌన్: ఓటేసిన రుద్రోజు మేఘన

మిర్యాలగూడ టౌన్ : గతేడాది అమెరికాలోని న్యూయార్క్‌లో ఎంఎస్ చదివేందుకు వెళ్లిన రుద్రోజు మేఘన సోమవారం లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలోని 88వ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకుంది. తాను మొదటిసారి లోక్‌సభ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడం చాలా ఆనందంగా ఉందని మేఘన తెలిపింది. ఓటు వేయడానికి ఎన్నో వేల కిలోమీటర్ల నుంచి స్వదేశానికి వచ్చిన వారిని పలువురు అభినందిస్తున్నారు.

అదుపుతప్పి లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు



ఘటనా స్థలంలో బస్సు, లారీ

ఆలేరురూరల్: ఆర్టీసీ బస్సు అదుపుతప్పి లారీని ఢీకొట్టింది. ఈ ఘటన సోమవారం ఆలేరు పట్టణ సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ డిపోకి చెందిన ఆర్టీసీ బస్సు సోమవారం సాయంత్రం ప్రయాణికులతో హైదరాబాద్‌లోని ఉప్పల్‌కు బయల్దేరింది. బస్సు ఆలేరు పట్టణ శివారులోని భారత్ పెట్రోల్ బంక్ సమీపంలోకి రాగానే.. ఆలేరు మండలం శ్రీనివాస్‌పురం గ్రామానికి చెందిన భిక్షపతి, కుమార్ పల్సర్ బైక్‌పై బస్సు ముందు వెళ్తూ ఒక్కసారిగా పెట్రోల్ బంక్‌లోకి వెళ్లేందుకు బైక్‌ను తిప్పారు. దీంతో బస్సు డ్రైవర్ వారిని ఢీకొట్టకుండా బస్సును పక్కకు తిప్పగా అదుపుతప్పి పెట్రోల్ బంక్ ముందున్న డివైడర్‌ను, లారీని ఢీకొని నిలిచిపోయింది. ఒక్కసారిగా జరిగిన ఈ ఘటనతో బస్సులోని ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అందరూ క్షేమంగా ఉండడంతో వేరే బస్సుల్లో గమ్య స్థానాలకు వెళ్లిపోయారు. బైక్‌పై ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలు కావడంతో ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటశ్రీను తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



నాగేష్ (ఫైల్)

రామన్నపేట: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం రాత్రి సర్నేనిగూడెం గ్రామ శివారులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మండలం నేరడ గ్రామానికి చెందిన వరికుప్పల నాగేష్(23) సర్నేనిగూడెంలో బొడ్రాయి పండుగ నిమిత్తం తమ బంధువుల ఇంటికి వెళ్లాడు. ఆదివారం రాత్రి బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. సర్నేనిగూడెం పాఠశాల సమీపంలోకి రాగానే రోడ్డు మీద పార్కింగ్ చేసి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో బలమైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం నాగేష్‌ను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరిస్థితి విషమించి సోమేవారం మృతి చెందాడు. మృతుడి మామ రూపని వెంకటేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లయ్య తెలిపారు.

ఓటేసిన శతాధిక వృద్ధులు



భువనగిరి రూరల్: ఓటు వేసి సిరా చుక్క చూపుతున్న రుక్కమ్మ

ఆత్మకూర్(ఎస్): నశీంపేటలో పోలింగ్ కేంద్రానికి వెళ్తున్న ఎల్లమ్మ

భువనగిరి రూరల్: భువనగిరి మండలంలోని నమాత్‌పల్లి గ్రామానికి చెందిన 104 ఏళ్ల అతికం రుక్కమ్మ సోమవారం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకుంది. గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఆమె ఓటు వేసింది.

ఆత్మకూర్(ఎస్)లో..

ఆత్మకూర్ (ఎస్): మండల పరిధిలోని నశీంపేట గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు వీరబోయిన ఎల్లమ్మ సోమవారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఓటు వేసింది. తన మనవడు సైదులు సహకారంతో పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు హక్కు వినియోగించుకుంది.

ఈవీఎంల ఏర్పాటు సరిగాలేదు..

- కాంగ్రెస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



నకిరేకల్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

నకిరేకల్ : పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంల ఏర్పాటు చేసిన తీరు సరిగా లేదని కాంగ్రెస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అభ్యంతరం తెలిపారు. నకిరేకల్ పట్టణంలోని పలు పోలింగ్ బూత్‌లను సోమవారం ఆయన స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి సందర్శించారు. పోలింగ్ సరళిని పరిశీంచారు. రెండు నియోజకవర్గాల్లో పోలింగ్ బూత్‌లను పరిశీలించానని.. అధికారులు ఈవీఎం ఏర్పాటు విషయం అశ్రద్ధ వహించారని చెప్పారు. ముందు వీవీ ప్యాట్ ఆ తరువాత ఈవీఎం -1, 2, 3 వరుస క్రమంలో లేవన్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. దీనివల్ల గుర్తులు తారుమారు అవుతున్నాయన్నారు. ఈ విషయంలో అధికారుల తీరు సరిగా లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే విధంగా కొనసాగుతుందని చెప్పారు. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, టీపీసీసీ నేత దైద రవీందర్, చామల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

తిరుగు ప్రయాణానికి తప్పని పాట్లు



నాన్‌స్టాప్ బస్సుల కోసం నల్లగొండ బస్టాండ్‌లో వేచిచూస్తున్న ప్రయాణికులు

నల్లగొండ రూరల్: ఓటు హక్కు వినియోగించుకునేందుకు హైదరాబాద్ నుంచి నల్లగొండకు వచ్చిన ఓటర్లు తిరిగి హైదరాబాద్‌కు వెళ్లేందుకు సోమవారం బస్టాండ్‌లో బస్సుల కోసం అవస్థలు పడ్డారు. పోలింగ్ కేంద్రాల్లోని ఈవీఎంలను, సిబ్బందిని తరలించేందుకు ఆర్టీసీ బస్‌లను ఉపయోగించడంతోపాటు ఉన్న కొద్దిపాటి బస్సులు రద్దీగా ఉండడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. నల్లగొండ బస్‌డిపో నుంచి రోజుకు 43 డీలక్స్ బస్‌లను హైదరాబాద్‌కు నడుపుతున్నారు. వీటికి తోడుగా అదనంగా మరో 50 ఆర్టీసీ బస్‌లను హైదరాబాద్ నుంచి తెప్పించారు. ఇందులో 50 బస్‌లను ఎన్నికలకు ఉపయోగించారు. అయితే డిమాండ్ మేరకు బస్‌లు లేకపోవడంతో ప్రయాణికులు తంటాలు పడ్డారు. మంగళవారం నుంచి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ అధికారులు తెలిపారు.